క్లుప్తంగా

21న మాల, మాదిగల ఆత్మీయ సమ్మేళనం



కొల్లాపూర్: మాల, మాదిగల ఐక్యత చాటేందుకు ఈ నెల 21న మాల, మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలంగాణ జానపద కళాకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మీసాల రాము మాదిగ వెల్లడించారు. మంగళవారం కొల్లాపూర్‌లోని కేఎల్‌ఐ అతిథి గృహంలో మాల, మాదిగ సంఘాలకు చెందిన నాయకులు సమావేశమయ్యారు. మీసాల రాముతో పాటు డాక్టర్ డప్పుస్వామి, తెలంగాణ మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు కలమంద శేఖర్ మాట్లాడారు. దళితులను సంఘటితం చేసేందుకు చేపట్టిన ఆత్మీయ సమ్మేళనానికి మాల, మాదిగలు తరలిరావాలన్నారు. సమావేశంలో నాయకులు కల్మూరి రాములు, మంతటి గోపి, విష్ణు, నర్సింహ, రామకృష్ణ, వడ్డెమాన్ నర్సింహ, డప్పు మధు, అంజి, ఉమ, స్వాతి తదితరులున్నారు.

కూచుకుళ్లను కలిసిన గోలి శ్రీనివాస్‌రెడ్డి

కల్వకుర్తి రూరల్: శాసనమండలి సభ్యుడు కూచుకుళ్ల దామోదర్‌రెడ్డిని భారత రాష్ట్ర సమితి నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో కలుసుకున్నారు. దామోదర్‌రెడ్డి కొంత కాలంగా పార్టీకి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఇలాంటి సమయంలో గోలి శ్రీనివాస్‌రెడ్డి ఆయనతో సమావేశం కావడం కల్వకుర్తి టీఆర్‌ఎస్ నాయకులు ఆసక్తి కనబరుస్తున్నారు.

చైర్మన్‌ను సన్మానించిన నాయకులు



కల్వకుర్తి రూరల్: రాష్ట్ర సహకార సంస్థ చైర్మన్‌గా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన రాజవరప్రసాద్‌ను మంగళవారం ఆయన కార్యాలయంలో కల్వకుర్తి మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్ ఆధ్వర్యంలో సన్మానించారు. నాయకులు సైకిలాబ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చారకొండ తహసీల్దార్‌గా శ్రీనివాస్‌రావు

చారకొండ: మండల నూతన తహసీల్దార్‌గా శ్రీనివాస్ రావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ ఏసీబీ అధికారులకు పట్టుబడటంతో నాగర్‌కర్నూల్ కలెక్టర్ కార్యాలయంలో సూపరిటెండెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్ రావు బదిలీపై ఇక్కడ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.

ఆలయానికి రూ.50 వేల విరాళం అందజేత



పెంట్లవెల్లి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించే శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవానికి కొల్లాపూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చింతలపల్లి జగదీశ్వర్‌రావు రూ.50 వేలను ఆలయ ప్రారంభోత్సవానికి ఆలయ కమిటీ పెద్దలకు విరాళంగా ఇచ్చారు. ముున్ముందు ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఆలయ ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఆలయ కమిటీ పెద్దలతో ఆయన చర్చించి సభ్యులకు విరాళం అందజేశారు. సుదర్శన్, సత్యనారాయణ, రాము, మోహన్, ఆనంద్ పాల్గొన్నారు.

'మన గుడి- మన బడి' ప్రారంభం

తాడూరు: మండలంలోని ఐతోల్‌లో విద్యార్థులతో పాటు యువకులకు ఎంతగానో ఉపయోగపడే 'మన గుడి- మన బడి' కార్యక్రమాన్ని సర్పంచ్ ఇందుమతినర్సింహారెడ్డి మంగళవారం ప్రారంభించారు. శిర్డీసాయి ఆలయ ఆవరణలో వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. శిబిరంలో ఆటపాటలతో పాటు భగవద్గీత పారాయణం సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపసర్పంచ్ హుస్సేన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఇంటింటికీ సీపీఐ' కార్యక్రమం వాయిదా

కొల్లాపూర్: నియోజకవర్గంలో మంగళవారం నుంచి చేపట్టాల్సిన ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం వాయిదా వేసినట్లు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎండీ ఫయాజ్ వెల్లడించారు. అకాల వర్షాల కారణంగా కార్యక్రమాన్ని వాయిదా వేశామన్నారు. మళ్లీ ఎప్పటి నుంచి కార్యక్రమం ప్రారంభించాలనే అంశాన్ని పార్టీ ముఖ్య నాయకులతో మాట్లాడి నిర్ణయిస్తామని తెలియజేశారు.

చేతికందిన పంటలు నేలపాలు

- అకాల వర్షాలతో ఆందోళన చెందుతున్న రైతులు
- నష్టపోతున్నామని ఆవేదన
- మొలకలు వస్తున్న వేరుశనగ



జంగిరెడ్డిపల్లిలో మొలకలు వస్తున్న వేరుశనగ పంటను చూపిస్తున్న రైతు

అమ్రాబాద్: అకాల వర్షాలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. నాలుగు రోజులుగా నిత్యం వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. వేసవి దుక్కులు దున్నుకునేందుకు వర్షాలు కురవడం సంతోషమే అయినా.. యాసంగి పంటలు సాగు చేసిన రైతులు అష్ట కష్టాలు పడుతున్నారు. మండలంలోని కుమ్మరోనిపల్లి, లక్ష్మాపూర్(బీకే), అమ్రాబాద్, మాచారం, జంగంరెడ్డిపల్లి, మాదవానిపల్లి తదితర గ్రామాల్లో మొత్తం 217 ఎకరాల్లో యాసంగి వరి సాగుచేశారు. ప్రస్తుతం పంట వడ్లకు ఒంగి కోత దశలో ఉంది. కురుస్తున్న వర్షాలకు ఇప్పటికే పంట వడ్లు రాలడం, చేను కింద పడటంతో కొంత మేర నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు ఇలాగే కొనసాగితే పూర్తిగా నష్టపోతామని ఆందోళన చెందుతున్నారు.

మండలంలోని 1,840 ఎకరాల్లో వేరుశనగ..

మండలంలోని పలు గ్రామాల్లో యాసంగిలో 1,840 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశారు. ఇప్పటికే 75 శాతం సాగు వరకు రైతులు పంటలను తీసి అమ్మకాలు జరిపారు. కొంత ఆలస్యంగా సాగు చేసిన 25శాతం పంట నేలపాలవుతోంది. కొంత అమ్రాబాద్, జంగంరెడ్డిపల్లి, ఎల్మపల్లి, కొత్తపల్లి తదితర గ్రామాల్లో వేరుశనగ పెరికి భూమి మీద మెదలుగా వేశారు. మరికొంత మంది రైతులు ఇంకా పంట పెరకలేదు. రోజూ కురుస్తున్న వర్షంతో మెదలు దడిసి మొలకలు వస్తున్నాయి. ఇంకా పెరకని చేను వేరుశనగ గింజలు భూమిలోనే మొలకలు వస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పంట నష్టాలను పరిశీలించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఎమిరెడ్డిపల్లి కొతదశలో వరిపంట

కల్లాల్లోనే ధాన్యం కుప్పలు



కోడేరు: అకాల వర్షాలకు పండించిన వరి ధాన్యాన్ని రైతులు మూసి ఉంచారు. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వరి కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడవకుండా జనుంపల్లి, కోడేరు, ముత్తిరెడ్డిపల్లి గ్రామాల్లో రైతులు కవర్లను వడ్లపై మూసి ఉంచారు. కొందరు రైతులు చేతికి వచ్చిన పంట కోతకు కోయకుండా ఉండటంతో వర్షానికి వరిపైరు కింద పడిపోయింది. ఈ సారి అకాల వర్షాలకు తీవ్రంగా నష్టపోయమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించుకోవాలి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

వెల్దంద: మండలంలోని రాచూర్‌లో నిర్వహిస్తున్న బీరప్ప ఉత్సవాల్లో మంగళవారం ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ హాజరై మాట్లాడారు. కులదేవతల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలన్నారు. దైవ భక్తి ఉంటేనే మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. గ్రామానికి బీటీరోడ్డు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరారు. త్వరలోనే ప్రభుత్వం రోడ్లను మంజూరు చేస్తోందన్నారు. అనంతరం గ్రామానికి చెందిన మహిళకు సీఎం సహాయనిధి రూ.26 వేల చెక్కును అందజేశారు. సర్పంచ్ జయమ్మ, ఎంపీటీసీ గుత్తి వెంకటయ్య, భూపతిరెడ్డి, వెంకటయ్యగౌడ్, పర్వతాలు, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టుల పనులు వేగవంతం

అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టుల పనులు వేగవంతం చేస్తామని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. రాచూర్‌లో విలేకరులతో మాట్లాడారు. నూతన సచివాలయంలో మొదటిసారిగా సమావేశం నిర్వహించిన సీఎం కేసీఆర్ పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుపై సమీక్ష నిర్వహించారన్నారు. అసంపూర్తిగా ఉన్న పనులను వేగవంతంగా పూర్తిచేసి జూలై నాటికి నీటిని ఎత్తిపోయాలని ఆదేశించారన్నారు. దేశ చరిత్రలో నూతనంగా సచివాలయాన్ని నిర్మించి డాక్టర్ అంబేడ్కర్ పేరు పెట్టడం కేసీఆర్‌ను ప్రపంచ దేశాలు అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణలో అన్ని రంగాల్లో సీఎం అభివృద్ధి చేస్తుంటే ప్రతి పక్ష పార్టీల నాయకులకు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయా గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

షటిల్ బ్యాడ్మింటన్ శిబిరం ప్రారంభం



కొల్లాపూర్: పట్టణంలోని ముదిరాజ్ సంఘ భవనం ప్రాగణంలో ఏర్పాటు చేసిన షటిల్ బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరాన్ని తహసీల్దార్ శివ శ్రీనివాస్ మంగళవారం ప్రారంభించారు. శిక్షణ శిబిరం ఏర్పాటు చేసిన ముదిరాజ్ సంఘం నాయకులను ఆయన అభినందించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు, యువత ఈ ఆటను నేర్చుకునేందుకు ఈ శిబిరం దోహదపడుతుందన్నారు. ఆర్‌ఐ.గోవింద్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం నాయకులు కుమారస్వామి, బిచ్చయ్య, సుధాకర్ తదితరులున్నారు.

మేడిపూర్‌లో ఖోఖో



తాడూరు: మండలంలోని మేడిపూర్ ఉన్నత పాఠశాలలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి ఖోఖో క్రీడా శిక్షణ శిబిరాన్ని మంగళవారం జిల్లా ఇన్‌చార్జ్ సామరమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవిలో నిర్వహించే క్రీడా శిక్షణ శిబిరాన్ని పాఠశాల విద్యార్థులతో పాటు ఇంటర్, డిగ్రీ విద్యార్థులందరూ పాల్గొని క్రీడల నుంచి మెలకువలు నేర్చుకుని జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలన్నారు. క్రీడాకారులు పరశురాములు, నరేందర్, సుల్తాన్, శివ, కురుమయ్య, మాసయ్య పాల్గొన్నారు.

హక్కుల కోసం సంఘటితం కావాలి

అచ్చంపేట: హక్కుల సాధన కోసం ప్రతిఒక్కరూ సంఘటితం కావాలని అచ్చంపేట ఎల్‌ఐసీ లియాఫీ అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి తుమ్మల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం అచ్చంపేట ఎల్‌ఐసీ షాటిలైట్ బ్రాంచ్ లియాఫీ యూనియన్ నుంచి ఢిల్లీ తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఢిల్లీలో ఏర్పాటు చేయనున్న ఆల్ ఇండియా లియాఫీ సమావేశంలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రత్యేక ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. సమావేశం అనంతరం ఆలిండియా కార్యవర్గాన్ని ఎన్నుకుంటారని చెప్పారు. ఎల్‌ఐసీ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈసీ మెంబర్లు వెంకటస్వామి, పదర శ్రీనివాసులు, స్వామికొండ, శ్రీనివాసులు, సాయిబాబు, శ్రీరాములు, కొత్త రమేష్, జంగయ్య, స్వామి, రాములు పాల్గొన్నారు.

కార్మికులను మోసం చేసిన కేసీఆర్



మాట్లాడుతున్న ఆర్ శ్రీనివాసులు

తెలకపల్లి: సీఎం కేసీఆర్ సఫాయన్నా.. సలాం అంటూ సపాయి కార్మికులను మభ్యపెడుతూ రాత్రింబవళ్లు వెట్టి చాకిరి చేయిస్తూ.. వారిని మోసం చేశారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన పంచాయతీ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సపాయి కార్మికులకు కొత్త సచివాలయం సాక్షిగా వేతనాలు పెరుగుతాయని ఎంతో ఆశించిన కార్మికులకు సీఎం నిర్ణయంపై నిరాశ మిగిలిందని, కేవలం రూ.1,000 మాత్రమే పెంచి కార్మికులను మోసగించారన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి సపాయి కార్మికులకు రూ.26 వేల వేతనం పెంచి ఆదుకోవాలని, లేదంటే పెద్దఎత్తున ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా నాయకులు తుమ్మ మహేష్, ఆంజనేయులు, గోపస్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



తెలకపల్లి: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని సింగిల్‌విండో వైస్ చైర్మన్ మామిళ్ల యాదయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సిద్ధార్థ మాడల్ పాఠశాలలో శృతిలయలు, కల్చరల్ అకాడమి ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. వివిధ అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. శృతిలయ కల్చరల్ అకాడమి నిర్వాహకులు సుల్తాన్ మాట్లాడుతూ.. ఈ శిక్షణ శిబిరంలో నృత్యాలు కాకుండా మ్యాథమెటిక్స్, ఆంగ్ల పరిజ్ఞానంపై శిక్షణ ఉంటుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. యాదయ్య , కృష్ణయ్య, రెడ్డపాకుల రమేష్, శ్రీనివాస్‌గౌడ్, శివప్రసాద్, లక్ష్మీపతి పాల్గొన్నారు.

నడింపల్లిలో మేడే జెండావిష్కరణ


అచ్చంపేట: మండల పరిధిలోని నడింపల్లి, సింగారం గ్రామాల్లో మంగళవారం సీపీఎం మండల కార్యదర్శి మల్లేష్ మేడే జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 18 గంటలు పనిచేసే కార్మికులు 8 గంటల పనిదినాల కోసం పోరాటం చేస్తే.. చాలా మంది కార్మికులు వీరమరణం పొందారన్నారు. కార్మికుల వీరమరణం పొందిన వారి స్ఫూర్తితో వచ్చిన దినం మేడే అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బాల్ లింగయ్య, బచ్చన్న, రేణయ్య, లక్ష్మయ్య, చింతల కృష్ణయ్య, వేమయ్య, మల్లేష్, కృష్ణారెడ్డి, జంగయ్య, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం

కల్వకుర్తి: పట్టణంలోని టీఎస్‌యూటీఎఫ్ భవనంలో మేడే వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. 14 మంది కవులు మంగళవారం నిర్వహించిన సమ్మేళనంలో పాల్గొన్నారు. కవులు తమ కవితలను, ఉపన్యాసాలను వినిపించారు. యాదగిరాచారి, సుధాకర్, ఆంజనేయులు, లక్ష్మణమూర్తి, రఘురాములు గౌడ్, శీనయ్య గౌడ్, జగన్మోహనాచారి, జగన్‌మోహన్‌రెడ్డి, జంగయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.



కంటి వెలుగు కేంద్రం ప్రారంభం



జంగంరెడ్డిపల్లిలో కంటి పరీక్షలు

తాడూరు: మండలంలోని చర్లతిరుమలాపూర్‌లో కంటి వెలుగు పరీక్ష కేంద్రాన్ని సర్పంచ్ నరేందర్, ఎంపీటీసీ సుశీల మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సంబంధిత అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. లక్ష్మయ్య, డా.ఎండీ ఇస్మాయిల్, శ్రీనివాసులు, శారద తదితరులు పాల్గొన్నారు.

అమ్రాబాద్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ లక్ష్మమ్మ సూచించారు. మండలంలోని జంగంరెడ్డిపల్లిలో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మమ్మ, వైద్యాధికారి సుధాకర్, పవన్‌కళ్యాణ్, ఏఎన్‌ఎం చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



మందులు, వస్త్రాలు అందిస్తున్న శ్రీనివాసులు

భక్తులకు వైద్యసేవలు

చారకొండ: మండల కేంద్రానికి చెందిన గ్రామీణ వైద్యులు చిల్వేరు శ్రీనివాసులు మంగళవారం శ్రీశైలం దేవస్థానంలో వైద్య శిబిరం నిర్వహించారు. భక్తులకు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వారి తండ్రి మల్లప్ప జ్ఞాపకార్థం వైద్యశిబిరం నిర్వహించినట్లు చెప్పారు.

సాగులో ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



అవగాహన కల్పిస్తున్న ఏఓ నాగార్జునరెడ్డి

లింగాల: నల్లమల అటవీ ప్రాంతంలో ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదాయకమని మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అవుసలికుంటలో 'ప్రకృతి వ్యవసాయంపై చెంచులకు ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించి అవగాహన కల్పించారు. ఐటీడీఏ, మన్ననూర్ ట్రైబల్ వెల్ఫేర్, చైల్డ్ కేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు మండలంలోని అవుసలికుంట, శాయిన్‌పేట, అప్పాయపల్లి, శ్రీరంగాపూర్, ఎర్రపెంట గ్రామాలకు చెందిన 158 మంది రైతులను గుర్తించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడారు. అందుబాటులో ఉన్న వనరులతో సేంద్రియ వ్యవసాయంలో భాగంగా కాషాయం తయారీ, పెరటితోట పెంపకం, వర్మీ కంపోస్టు(వానపాముల ఎరువు) తయారీపై అవగాహన కల్పిస్తామన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా జీవనోపాధి కల్పించాలని ప్రభుత్వం భావిస్తుందన్నారు. రసాయన ఎరువుల కన్న, పంటలకు సేంద్రియ ఎరువులను వాడితే పంటలను చీడపీడల బారి నుంచి రక్షించుకోవచ్చని, దిగుబడులు కూడా ఆశించిన స్థాయిలో ఉంటాయని తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బండి ఎల్లయ్య, ఏఈఓ సురేందర్‌రెడ్డి, ఈసీ ఆర్పీలు కురుమయ్య, బుచ్చిరాజు, చెంచు రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఏఈఓ మధుసూదన్

కోడేరు: మండలంలోని రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏఈఓ మధుసూదన్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు దుక్కులు దున్నేటప్పుడు భూసార పరీక్షలు చేయించుకుని అధిక దిగుబడి పొందాలన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలు పాటించి పంటలు సాగు చేసుకుంటే అధిక లాభాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో రైతులు సైకిలాబ్, స్వామి, ఉమ్మర్, దాసు, మద్దిలేటి పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న డా.మధు

పెద్దకొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం కుర్వయాదవులకు రెండో విడత గొర్రెలు లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తుంది. లబ్ధిదారులంతా ప్రభుత్వం అందించే సబ్సిడీ గొర్రెలను తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలని పశువైద్యాధికారి డా.మధు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం గొర్రెల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన విధంగా యూనిట్ ధరకు డీడీలు చెల్లించి గొర్రెలను పొందాలని సూచించారు. జెడ్పీటీసీ గౌరమ్మ మాట్లాడుతూ.. ప్రభుత్వం గొల్లకురువల సంక్షేమం కోసం గొర్రెల పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో చంద్రయ్య, నాగరాజు, రాముడు, బీరయ్య, మాసయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అండగా నిలిచిన స్నేహితులు



ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

కల్వకుర్తి రూరల్: తాము కలిసి చదువుకున్న స్నేహితుడు ఆపదలో ఉంటే ఆ స్నేహితుడిని ఆదుకునేందుకు తోటి స్నేహితులు చేయి చేయి కలిపి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని జీడిపల్లికి చెందిన రామకృష్ణ పట్టణంలోని యశోదయా జూనియర్ కళాశాలలో 2003–05 సంవత్సరంలో ఇంటర్ విద్యను పూర్తి చేసుకున్నాడు. ఏడాది కిందట గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకోవడానికి రూ.5 లక్షలు ఖర్చు చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న ఇంటర్ బ్యాచ్ విద్యార్థులు ఆపదలోని తమ స్నేహితుడికి అండగా నిలుద్దామనుకున్నారు. వెంటనే రూ.లక్ష సమకూర్చి మంగళవారం గ్రామానికి వెళ్లి రామకృష్ణకు అందించారు. తమ స్నేహితులు తనకు సహకారం అందించడంతో రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. 18 సంవత్సరాల కిందట కలిసి చదువుకున్న విద్యార్థులు కష్ట సమయంలో అండగా నిలవడం అభినందనీయమని గ్రామస్తులు అన్నారు. సాయం అందజేసిన వారిలో మిత్రులు ఇందిర, రేణుక, పరశురాములు, బాలరాజుగౌడ్, మురళీధర్‌రెడ్డి, శంకర్‌గౌడ్, కృష్ణ, విజయ్‌నాయక్, షాబాజ్, నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ప్రతిష్ఠాపన



ఉత్సవమూర్తులతో వట్టెం గ్రామ పెద్దలు

బిజినేపల్లి: మండలంలోని వట్టెంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ప్రతిష్ఠాపన కార్యక్రమాలను మంగళవారం మొదటి రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ముఖ్య సమన్వయకర్త సందడి నరేందర్‌రెడ్డి, అభివృద్ధి కమిటీ చైర్మన్ తిరుమలగిరి రత్నయ్య, గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు తొలి రోజు పూజలో పాల్గొన్నారు. మొదటి రోజు పూజలతో పాటు భజన మండలి భజనలు, మహిళల భజనలు, కోలాటాలు వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వట్టెం వేంకటేశ్వరస్వామి ఆలయ స్థానాచార్యులు శ్రీమద్వాదుల శ్రీమన్నారాయణచార్యుల అర్చక బృందం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన



తెలకపల్లిలో పంచాయతీ కార్యదర్శులు

నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ జూనియర్ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ.. పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె మంగళవారం 5వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. సురేష్, బాబు, శివ, స్వామి, ముజీవన్, హేమలత తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారికి వినతి అందజేశారు.

కొల్లాపూర్: పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ.. పంచాయతీ కార్యదర్శుల సంఘం నియోజకవర్గ కమిటీ నాయకులు కొల్లాపూర్‌లోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఐదురోజులుగా నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా వారు మంగళవారం నోటికి నల్ల గుడ్డలు కట్టుకొని నిరసన చేపట్టారు. సమ్మెకు బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కారంగి బ్రహ్మయ్యతో పాటు ఆ పార్టీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, బీఎస్పీ నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం గతంలో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఏప్రిల్ 11న పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాల్సి ఉందన్నారు. కానీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండా సమ్మె చేపట్టే పరిస్థితులను కల్పించిందన్నారు. బీఎస్పీ నాయకులు శేఖరయ్య, నర్సింహ, వెంకటేష్, వెంకటేష్‌నాయుడు, కృష్ణయ్య, అన్వేష్, వెంకటేష్, పవన్, బేగం, బాలరాజు పాల్గొన్నారు.

కల్వకుర్తి రూరల్: తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ.. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఆందోళన ఉధృతం చేశారు. మంగళవారం దీక్షా శిబిరంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేయడంతో పాటు శిబిరం ఎదుట మహిళా పంచాయతీ కార్యదర్శులు బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తం చేవారు.

తెలకపల్లి: కళ్ల గంతలు కట్టుకుని పంచాయతీ కార్యదర్శులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భాస్కర్, సరిత, లక్ష్మి, అనిత, కృష్ణవేణి, కాశీం, అమరేందర్, హేమలత, చరణ్, తిరుపతయ్య, పరశురాములు, సందీపు, యశ్వంత్ పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ గాంధీ పార్కులో..



కొల్లాపూర్‌లో నిరసన

ఇబ్బందులకు గురిచేయడం సరికాదు

నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అన్ని పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించారని, కేజీబీవీ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మాత్రం సెలవులు ఇవ్వకుండా బయోమెట్రిక్ నమోదు చేయాలని సూచించడం సరైన పద్ధతి కాదని తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డికి ఈ విషయమై ప్రభుత్వంతో చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ ఉత్తరాలు పంపించారు.